సాక్షి అనంతపురం

బుధవారం । 16 । అక్టోబర్ । 2024



ఎన్నికల బిల్లుల విడుదల

సాధారణ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో పెండింగ్ బిల్లుల చెల్లింపునకు రూ.17.27 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది.



ఇన్‌చార్జ్ మంత్రిగా టీజీ భరత్

జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా టీజీ భరత్ నియమితులయ్యారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న ఆయన జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తారన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

గరిష్టం/కనిష్టం
31.1°/21.9°

జిల్లా అంతటా మంగళవారం తుపాను వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆగ్నేయ దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఇసుక తవ్వి నీటి కష్టాలు తెచ్చిపెడతారా?



అధికారులతో మాట్లాడుతున్న గ్రామీణులు

యల్లనూరు: ఇసుక తవ్వి తాగు, సాగు నీటి కష్టాలు తెచ్చిపెడతారా అంటూ మండలంలోని చిలమకూరు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రీచ్ ఏర్పాటుకు మంగళవారం అధికారులు పనులు చేస్తుండగా అడ్డుకున్నారు. తమ గ్రామ సమీపంలో ఇసుక రీచ్ ఏర్పాటు చేయరాదంటూ తేల్చిచెప్పారు. బకెట్ ఇసుక కూడా తవ్వనివ్వబోమని భీష్మించి కూర్చున్నారు. దీనిపై మైనింగ్ డీడీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విషయాన్ని కలెక్టరు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. తాడిపత్రి ఏడీ ఓబుళరెడ్డి, పుట్లూరు తహసీల్దార్ శేషారెడ్డి, సర్పంచ్ నాగరాజు తదితరులున్నారు.

మద్యం షాపు ఏర్పాటుపై నిరసన



నిరసన తెలుపుతున్న దృశ్యం

అనంతపురం: జన సంచారం అధికంగా ఉండే ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటుపై మహిళలు నిరసనకు దిగారు. నగరంలోని విద్యుత్‌నగర్ సర్కిల్‌లో నాలుగు ఆస్పత్రులున్నాయి. హోటళ్లు కూడా అధికంగా ఉన్నాయి. విద్యార్థులు కళాశాలలకు ఈ దారిలోనే వెళ్తుంటారు. సమీపంలోనే ఆంజనేయస్వామి ఆలయం ఉండడంతో భక్తుల తాకిడి కూడా ఉంటుంది. ఈ నేపథ్యంలో అక్కడ మద్యం షాపు ఏర్పాటు చేస్తుండటంపై మహిళలు మండిపడ్డారు. మంగళవారం షాపు ఎదుట ఆందోళన చేపట్టారు. మద్యంమత్తులో మహిళలను ఇబ్బంది పెడితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. చర్యలు తీసుకోవాలంటూ ఎక్సైజ్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

మొన్నటిదాకా షాపులకు దరఖాస్తులు చేసుకోనివ్వకుండా నానా అవస్థలకు గురిచేశారు. అడ్డంకులను అధిగమించి లాటరీలో షాపు దక్కించుకుంటే నేడు మరో రకంగా వేధిస్తున్నారు. 'ఉన్నది మా ప్రభుత్వం.. పెగ్గు పెగ్గులో భాగస్వామ్యం ఉండాల్సిందే' అన్నట్లుగా పట్టుబడుతున్నారు. ఈ క్రమంలో తమ బాధ ఎవరికి చెప్పుకోవాలో తెలియక తటస్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. లాటరీలో లిక్కర్ షాపు తగిలిందని సంతోషపడాలో, షాపు విడిచిపెట్టకపోతే అంతుచూస్తామంటున్న 'పచ్చ' నేతల బెదిరింపులకు భయపడాలో అర్థం కావడం లేదంటూ నిట్టూరుస్తున్నారు.



మీకు స్మాల్.. మాకు లార్జ్!



- మద్యం షాపులు దక్కించుకున్న తటస్థుల మెడపై టీడీపీ నేతల కత్తి
- 'గుడ్ విల్' లేదా పర్సెంటేజీతో నడుపుదామంటూ ఒత్తిళ్లు
- తాడిపత్రి, గుంతకల్లు, రాప్తాడులో తీవ్రంగా బెదిరింపులు
- 'దుర్గం'లో లిక్కర్ షాపు దక్కించుకున్న వ్యక్తి హోటల్‌పై దాడులు
- షాపు దక్కినా సంతోషం లేకుండా పోయిందంటూ పలువురు నిట్టూర్పు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: బెదిరింపులు, రౌడీయిజం, వేధింపులు ఇలా ఒకటేమిటి లాటరీలో మద్యం షాపు దక్కించుకున్న తటస్థులపై టీడీపీ నేతలు అన్ని రకాల విద్యలూ ప్రయోగిస్తున్నారు. మద్యం ప్రియులు ఉపయోగించే 'స్మాల్', 'లార్జ్' పదాలతో బెంబేలెత్తిస్తున్నారు. మాకు మేజర్ షేర్ ఇవ్వండి.. మీరు తక్కువ తీసుకోండంటూ బెదిరిస్తున్నారు. ఈనెల 14న లాటరీ ప్రక్రియ ముగిసిన మరుక్షణం నుంచే టెండర్ దక్కించుకున్న వారిని వెంటాడి వేధిస్తున్నట్టు తెలిసింది. ఇంటికి మనుషులను పంపించడం లేదంటే పోలీసులు, ఎక్సైజ్ అధికారులతో ఫోన్లు చేయించి బెదిరించడం చేస్తున్నారు. జిల్లాలో 136 షాపులకు గాను 100 షాపులను కూటమి నేతలే సిండికేట్ అయి దక్కించుకున్నారు. మిగిలిన 36 షాపులూ తమకే కావాలంటూ వికృత చేష్టలకు పాల్పడుతున్నారు.

వ్యాపారం చేయగలరా..?

చాలా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలే రౌడీల్లా ప్రవర్తిస్తున్నారు. ఇప్పటికే తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తనకు 15 శాతం కప్పం కట్టాల్సిందేనని హెచ్చరించారు. తాజాగా షాపులు దక్కించుకున్న తటస్థుల కోసం వెంటాడుతున్నట్టు తెలిసింది. గుంతకల్లులో టీడీపీ నేతలు సాధారణ వ్యక్తులకు వచ్చిన షాపులను దక్కించుకునేందుకు సంప్రదింపులు ప్రారంభించారు. గుడ్‌విల్ ఇస్తాం.. ఇచ్చేయండి అంటూ భయపెడుతున్నారు. దీంతో కొంత మంది భయపడి ఎమ్మెల్యే వర్గీయులతో టచ్‌లోకి వెళ్లినట్టు సమాచారం. రాప్తాడు నియోజకవర్గంలో లాటరీ సమయంలోనే ఓ మహిళను బెదిరించి పరిటాల వర్గీయులు మద్యం షాపు లాక్కున్నారు. తాజాగా టీడీపీ వారు కాకుండా షాపులు దక్కించుకున్న ఇతరుల ఇళ్లవద్దకు తమ మనుషులను పంపుతున్నట్లు తెలిసింది. ఇక.. అనంతపురం నగరంలో మద్యం షాపులు దక్కించుకున్న తటస్థులతో స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అనుచరులు రాయ'బేరాలు' చేస్తున్నారు. శింగనమలలో షాపులు ఎవరు దక్కించుకున్నా నెలవారీ పర్సెంటేజీ ఇవ్వాలని టీడీపీ నేతలు అల్టిమేటం జారీ చేసినట్టు తెలిసింది.

దందాపై చర్చలు..

సిండికేట్‌లో షాపులు దక్కించుకున్న కూటమి నేతలు 24 గంటలు కూడా గడవక ముందే ధరలపై చర్చిస్తున్నట్టు సమాచారం. జిల్లా వ్యాప్తంగా ఎక్కువగా టీడీపీ నాయకులకే షాపులు దక్కిన నేపథ్యంలో ఎంఆర్‌పీ కంటే 5 నుంచి 10 శాతం ఎక్కువకు విక్రయించి దందా చేయడంపై కసరత్తు చేస్తున్నారు. రోజుకు రూ.6 కోట్లకు పైగా వ్యాపారం జరిగే అవకాశం ఉంది. ఈ క్రమంలో 5 శాతం అధికంగా వేసుకున్నా మద్యం ప్రియులపై రోజుకు రూ.30 లక్షల భారం పడనుంది. నెలకు రూ.9 కోట్లు అదనంగా చెల్లించాల్సి రావచ్చు.

కూర్చుని మాట్లాడుకో..!

'దుర్గం'లో మద్యం షాపు దక్కించుకున్న వ్యక్తికి కమిషనర్ సూచన



దినేష్‌కుమార్ హోటల్‌లో విచారణ చేస్తున్న కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ (వృత్తంలో)

కళ్యాణదుర్గం: 'టీడీపీ నేతలతో కూర్చుని మాట్లాడుకో.. అన్నీ సర్దుకుంటాయి.. లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది'... మద్యం షాపు టెండర్ దక్కించుకున్న ఓ వ్యక్తికి కళ్యాణదుర్గం మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ ఇచ్చిన ఉచిత సలహా ఇది. వివరాలు.. 'దుర్గం'లో 127వ మద్యం షాపును దినేష్ కుమార్ నాయుడు అనే హోటల్ నిర్వాహకుడు లాటరీలో దక్కించుకున్నాడు. ఇది జరిగి 24 గంటలు కూడా గడవక ముందే మంగళవారం పట్టణంలోని జూనియర్ కళాశాల రోడ్డులో దినేష్ నిర్వహిస్తున్న గురు రాఘవేంద్ర హోటల్‌లో మున్సిపల్ అధికారులు తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా హోటల్ నిర్వహిస్తున్నారని, అనుమతులు లేకుండానే భవనంపై గదులు నిర్మించారని, మున్సిపల్ అప్రూవల్ లేదంటూ బిల్డింగ్ యజమానికి కమిషనర్ వంశీ కృష్ణ భార్గవ్ నోటీసులిచ్చారు. ఈ క్రమంలోనే దినేష్‌కు ఉచిత సలహా ఇచ్చారు.

బెదిరింపులకు లొంగకపోవడంతో..: మద్యం షాపు వదులుకోవాలంటూ ఒత్తిడి చేసినా దినేష్ లొంగకపోవడంతోనే అధికారులను ఉసిగొల్పారనే విమర్శలు వినిపిస్తున్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు.. సోమవారం టెండర్ దక్కించుకున్న దినేష్‌కు ఓ టీడీపీ ముఖ్య నాయకుడు ఫోన్ చేశాడు. లైసెన్సు ఇచ్చివెళ్లాలని హుకుం జారీ చేశాడు. అయితే, ససేమిరా అన్న దినేష్ అనంతపురం నుంచి కళ్యాణదుర్గం చేరుకున్నాడు. ఈ క్రమంలోనే సదరు ముఖ్య నాయకుడు అధికారులను ఉసిగొల్పినట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కళ్యాణదుర్గంలో అనుమతులు లేని హోటళ్లు, లాడ్జిలు అనేకం ఉన్నా, లే అవుట్లు, అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చినా పట్టించుకోని కమిషనర్.. టీడీపీ ముఖ్య నేత మెప్పు పొందేందుకు దినేష్‌ను వేధింపులకు గురి చేయడంపై పలువురు విస్మయం వ్యక్తం చేశారు.

అల'జడి'



అనంతపురం అగ్రికల్చర్: అల్పపీడనం ప్రభావంతో మంగళవారం ఉదయం జిల్లా వ్యాప్తంగా జడివాన కురిసింది. చాలా మండలాల్లో గంటకు పైగా మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం వరకు తెరపివ్వడంతో ఉక్కపోత పెరిగింది. మళ్లీ సాయంత్రం ఆకాశం మేఘావృతమై చాలా మండలాల్లో వర్షపాతం నమోదైంది. అనంతపురం, బుక్కరాయసముద్రం, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం, రాప్తాడు, ఆత్మకూరు, రాయదుర్గం, బొమ్మనహాళ్, కళ్యాణదుర్గం, కుందుర్పి, కూడేరు, నార్పల, యల్లనూరు, విడపనకల్లు తదితర మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. అక్టోబర్ సాధారణ వర్షపాతం 100.9 మి.మీ కాగా ఇప్పటివరకూ 60 మి.మీ నమోదైంది. ఓవరాల్‌గా జూన్ 1 నుంచి ఇప్పటి వరకు 383.9 మి.మీ గానూ 27 శాతం అధికంగా 490.7 మి.మీ నమోదైంది. 36 వర్షపు రోజులు (రెయినీడేస్) రికార్డయ్యాయి. 20 మండలాల్లో సాధారణం కన్నా అధికంగా, ఏడు మండలాల్లో సాధారణం, నాలుగు మండలాల్లో సాధారణం కన్నా కాస్త తక్కువ వర్షపాతం నమోదైంది.

ఐదు రోజులు వర్షాలే!

రాగల ఐదు రోజులూ జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి మంగళవారం విడుదల చేసిన వాతావరణ బులెటిన్‌లో తెలిపారు. భారత వాతావరణ శాఖ, అమరావతి వాతావరణ కేంద్రం అందించిన సమాచారం మేరకు రాగల ఐదు రోజులూ చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరుగా వర్షపాతం నమోదు కావచ్చన్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 27.3 డిగ్రీల నుంచి 30 డిగ్రీలు, కనిష్టం 22.8 డిగ్రీల నుంచి 23.6 డిగ్రీల మధ్య నమోదు కావచ్చని తెలిపారు. గాలిలో తేమశాతం ఉదయం 90 నుంచి 94, మధ్యాహ్నం 74 నుంచి 88 శాతం మధ్య రికార్డు కావచ్చన్నారు. ఈశాన్యం దిశగా గాలులు గంటకు 2 నుంచి 7 కిలోమీటర్ల వేగంతో వీస్తాయన్నారు. ఈనెల 16, 17, 18 తేదీల్లో మంచి వర్షపాతం నమోదు కావచ్చని పేర్కొన్నారు. ఖరీఫ్ పంట తొలగింపు, పంట నూర్పిడితో పాటు రబీ పంటలు సాగు చేసే రైతులు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు.

క్లుప్తంగా

మహిళ మృతికి కారణమైన క్లినిక్ సీజ్



ఆర్ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేయిస్తున్న డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి

బుక్కరాయసముద్రం: ఇటీవల రోగి నాగరత్నమ్మ మృతికి కారణమైన బీకేఎస్‌లోని ఆర్ఎంపీ మునిరెడ్డి క్లినిక్‌ను డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి మంగళవారం సీజ్ చేశారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీని ఆమె తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ త్యాగరాజు, డాక్టర్ రవిశంకర్, డాక్టర్ స్వాతిలక్ష్మి, సీహెచ్ఓ మోహన్, గంగాధర్, పాల్గొన్నారు.

అనుమతులు లేని ఆస్పత్రి సీజ్

గుత్తి: స్థానిక తురకపల్లి రోడ్డులో ఉన్న శ్రీలక్ష్మి ఆస్పత్రిని మంగళవారం రాత్రి డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి సీజ్ చేశారు. అనుమతులు లేకుండా ఆర్ఎంపీ శేఖర్... శ్రీలక్ష్మి పేరుతో ఆస్పత్రిని నిర్వహిస్తున్నాడు. దీనిపై పక్కా ఆధారాలతో కలెక్టర్‌కు కొందరు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు రంగంలో దిగిన డీఎంహెచ్ఓ రెండు రోజులుగా విచారణ చేపట్టి ఎలాంటి అనుమతులు లేకుండా ఆస్పత్రి నిర్వహిస్తున్నట్లుగా గుర్తించి సీజ్ చేశారు. ఆర్ఎంపీ శేఖర్‌పై చర్యలు తీసుకుంటున్నట్లు వైద్యాధికారులు తెలిపారు.

త్వరలో 'అనంత'లో సంతోష్ ట్రోఫీ నిర్వహణ

అనంతపురం : ఫుట్‌బాల్ క్రీడలో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే సంతోష్ ట్రోఫీ నిర్వహణకు అనంత క్రీడాగ్రామం వేదిక కానుంది. నవంబర్ నెలలో ట్రోఫీ నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీటీ వర్గాలు వెల్లడించాయి. ప్రతిష్టాత్మకంగా భావించే సంతోష్ ట్రోఫీని ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించేందుకు సమ్మతించడం గర్వకారణంగా భావిస్తున్నట్లు ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ (ఏపీఎఫ్ఏ) జనరల్ సెక్రెటరీ ఎం.డేనియల్ ప్రదీప్ పేర్కొన్నారు. కాగా, 40 సంవత్సరాల తర్వాత తొలిసారి ఆంధ్రప్రదేశ్‌లో సంతోష్ ట్రోఫీ నిర్వహించే అవకాశం దక్కింది. ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ (ఏఐఎఫ్ఎఫ్) ఆధ్వర్యంలో జరిగే ఈ టోర్నీ ట్రోఫీను ఇప్పటి వరకూ అత్యధికంగా 32 సార్లు పశ్చిమ బెంగాల్ సొంతం చేసుకుంది.

19 నుంచి రాజమాత జీజాబాయి ట్రోఫీ

అనంతపురం: ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ చరిత్రలో తొలిసారిగా ఆర్డీటీ సౌజన్యంతో అనంత క్రీడాగ్రామం వేదికగా ఆల్ ఇండియా జోనల్ స్థాయి రాజమాత జీజాబాయి ట్రోఫీ సీనియర్ ఫుట్‌బాల్ టోర్నీ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్, జనరల్ సెక్రెటరీ ఎం. డేనియల్ ప్రదీప్ మంగళవారం తెలిపారు. టోర్నీ నిర్వహణకు అవకాశం కల్పించిన ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛోఫెర్రర్‌కు అభినందనలు తెలిపారు. కాగా, ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకూ అనంతపురంతో పాటు ఒడిశా, లడఖ్, మధ్యప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్‌లో ఈ టోర్నీ సమాంతరంగా జరుగుతుంది. 16 రాష్ట్రాల జట్లు టోర్నీలో పాల్గొంటాయి.

మత్తు.. గమ్మత్తు

- ఆపరేషన్లలో కీలకంగా మారిన అనస్తీషియా వైద్యం
- చిన్న కేసు నుంచి కష్టతరమైన శస్త్ర చికిత్సలకూ అనస్తీషియా తప్పనిసరి
- జీజీహెచ్‌లో సమష్టి విధులతో రాణిస్తున్న అనస్తీషియా విభాగం

అనస్తీషియా విభాగం యూనిట్ల సంఖ్య 2

ఆపరేషన్ థియేటర్ల సంఖ్య 24

ఏడాది	శస్త్రచికిత్సల సంఖ్య
2020	5,975 (కోవిడ్ కారణంగా తక్కువ)
2021	9,914
2022	10,024
2023	13,216
2024	10,987(ఇప్పటి వరకు)

సందర్భం: నేడు ప్రపంచ అనస్తీషియా దినం

అనంతపురం మెడికల్: సరైన విధానంలో వాడితే అదే మత్తు కూడా గమ్మత్తుగా మారి ఓ ప్రాణాన్ని నిలుపుతోంది. పూర్వం వివిధ శస్త్రచికిత్సల సమయంలో విపరీతమైన బాధతో రోగులు విలవిల్లాడేవారు. అలాంటి సమయంలో శస్త్రచికిత్స చేయడం వైద్యులకు పెను సవాల్‌గానే ఉండేది. ఈ క్రమంలో రోగిని ఓ పదిమంది బలవంతులైన మనుషులు గట్టిగా పట్టుకుంటేనే అప్పట్లో వైద్యులు శస్త్రచికిత్స చేసేవారు. 1846, అక్టోబరు 16న అమెరికాలోని మసాచుసెట్స్ ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్ విలియమ్స్ థామస్ గ్రీన్ మార్టన్, దంత వైద్యుడు జాన్ కొలిన్స్‌తో కలిసి ఓ రోగికి తొలిసారిగా మత్తుమందు (ఈథర్ అనస్తీషియా) ఇచ్చి గొంతుకు శస్త్రచికిత్స చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఏటా అక్టోబర్ 16న ప్రపంచ అనస్తీషియా దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో అనంతపురంలోని ప్రభుత్వ వైద్య కళాశాలతో పాటు సర్వజనాస్పత్రిలో బుధవారం ప్రపంచ అనస్తీషియా దినోత్సవాన్ని జరిపేందుకు సంబంధిత విభాగం వైద్యులు ఏర్పాట్లు చేశారు.

అనస్థీటిస్ట్ ఓ వైద్యుడే

రోగికి ఎలాంటి నొప్పి తెలియకుండా ఆపరేషన్‌ను విజయవంతం చేయడంలో అనస్తీషియా అనేది చాలా కీలకం. అయితే అనస్తీషియా ఇచ్చే నిపుణుడు కూడా ఓ వైద్యుడే అనేది చాలా మందికి తెలియదు. నాడీ వ్యవస్థపై పరిపూర్ణమైన అవగాహన కలిగిస్తూ నిష్ణాతులుగా తీర్చిదిద్దే కోర్సునే అనస్తీషియాలజీ అని అంటారు. ఆపరేషన్ చేసే సమయంలో నొప్పి తెలియకుండా ఉండేందుకు నాడీ వ్యవస్థ స్పందనలను అనస్థీటిస్ట్ అణిచివేస్తారు. దీంతో గుండె, ఊపిరితిత్తులు, లివర్, మూత్రపిండాల పనితీరులో హెచ్చుతగ్గులు ఎంతో జాగ్రత్తగా గమనించి, అత్యవసర సమయంలో సరైన చర్యలు తీసుకోవడమే మత్తు వైద్య నిపుణుడి బాధ్యత. ఆపరేషన్ జరిగే సమయంలో రక్త స్రావాన్ని గమనించుకుంటూ తగు మోతాదులో సెలైన్, రక్తం ఎక్కించే నిర్ణయం కూడా మత్తు వైద్యుడిదే. మత్తు మందు నిపుణుడి విధులను సాధారణంగా శస్త్రచికిత్సకు ముందు, ఇంట్రా ఆపరేటివ్, శస్త్రచికిత్స తర్వాత అనే మూడు విభాగాలుగా విభజిస్తారు. శస్త్రచికిత్సకు ముందు అనస్తీషియాను ఇవ్వడం ద్వారా ఉత్పన్నమయ్యే సమస్యలను తెలుసుకునేందుకు రోగి వైద్య చరిత్రతో పాటు ప్రస్తుత పరిస్థితిని అంచనా వేయాలి. శస్త్రచికిత్స ప్రక్రియ ముగిసే వరకూ, ఆ తర్వాత కూడా రోగి బాధ్యత వహిస్తారు.

దీర్ఘకాలిక నొప్పి మాయం

అనస్థీటిస్ట్‌కు ఒకప్పుడు మత్తు ఇవ్వడం మాత్రమే కర్తవ్యంగా ఉండేది. కాలక్రమేణ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని రోగులకు మెరుగైన వైద్యం అందిచండంలో మత్తు వైద్యులు కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని అనస్తీషియా విభాగంలో 2023, మే 5న పెయిన్ రిలీఫ్ క్లినిక్‌ను ప్రారంభించారు. దీర్ఘకాలిక నొప్పులతో బాధపడేవారికి పాలియేటివ్ థెరపీ ద్వారా నొప్పి మాయం చేస్తున్నారు. ఇప్పటి వరకూ 5వేల మందికి పాలియేటివ్ థెరపీ ఇచ్చారు.



బోధనాస్పత్రిలోని అనస్తీషియా విభాగం వైద్యులు, సిబ్బంది

సమష్టి కృషితో సేవలు



ప్రభుత్వ సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిల్లో జరిగే శస్త్రచికిత్సల్లో అనస్తీషియా వైద్యులు సమష్టిగా సేవలందిస్తున్నారు. ఆస్పత్రిలోని 24 థియేటర్లలో మత్తు మందు వైద్య బృందం అందిస్తున్న సేవలు మరువలేనివి. ఆస్పత్రిలో ఏటా జరిగే వేల సర్జరీలు విజయవంతం చేయడంలో ఎంతో బాధ్యతగా విధులు నిర్వర్తిస్తున్నాం. పెయిన్ రిలీఫ్ క్లినిక్ ద్వారా దీర్ఘకాలిక నొప్పులకు చెక్ పెడుతున్నాం. ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడకు వచ్చి వైద్యం పొందుతున్నారు.

– డాక్టర్ నవీన్‌కుమార్, హెచ్ఓడీ, అనస్తీషియా, జీజీహెచ్



మోకాలి నొప్పులకు చికిత్స చేస్తున్న దృశ్యం

24 ఆపరేషన్ థియేటర్లు.. వేల సంఖ్యలో శస్త్రచికిత్సలు

జిల్లాలోని ప్రభుత్వ బోధనాస్పత్రిలో 24 ఆపరేషన్ థియేటర్లున్నాయి. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో మెయిన్ ఆపరేషన్ థియేటర్లు(ఓటీలు) ఐదు ఉండగా ఓబీజీ 4, ఆర్థోపెడిక్స్ 4, అప్తమాలజీ 1, ఈఎన్‌టీ 1, సూపర్ స్పెషాలిటీలో 6, ఎమర్జెన్సీ ఓటీలు 3 ఉన్నాయి. వీటిలో గైనిక్, లేబర్, ఆర్థో, సర్జరీ, పీడియాట్రిక్ సర్జరీ, ఈఎన్‌టీ విభాగాల్లో రోజూ పదుల సంఖ్యలో ఆపరేషన్లు నిర్వహిస్తుంటారు. ఎమర్జెన్సీ ఓటీలో రోజూ సిజేరియన్ ఆపరేషన్లు జరుగుతూ ఉంటాయి. ప్రధానంగా బ్రెయిన్ క్యాన్సర్లు, వివిధ రకాల కేన్సర్ సమస్యలు, వెన్నుపూస, మోకాళ్ల మార్పిడి, తుంటి మార్పిడి, పుట్టిన పిల్లలకు మేజర్ ఆపరేషన్లు, హెర్నియా తదితర ఆపరేషన్లు పెద్ద సంఖ్యలో జరుగుతున్నాయి. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో జరిగే న్యూరో, యూరాలజీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ సర్జరీల్లోనూ అనస్తీషియా విభాగం కీలకంగా పని చేస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2022, మే నుంచి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో సర్జరీలు విజయవంతంగా సాగుతున్నాయి.

బెంగళూరు-కలబురిగి మధ్య ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బెంగుళూరు-కలబురిగి మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్‌బాబు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 30, నవంబర్ 2వ తేదీన బెంగుళూరు జంక్షన్ నుంచి రాత్రి 9.15 గంటలకు రైలు (06533) బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.40 గంటలకు కలబురిగి జంక్షన్‌కు చేరుతుంది. తిరిగి ఈ రైలు ఈ నెల 31, నవంబర్ 3న కలబురిగి జంక్షన్ నుంచి ఉదయం 9.35 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 8.00 గంటలకు బెంగుళూరు జంక్షన్‌కు చేరుతుంది. మార్గం మధ్యలో యలహంక, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం, రాయచూర్, కృష్ణ, యాదగిరి, షాబాద్ స్టేషన్లలో నిలుస్తుంది.

రూ.10 నాణెంపై అపోహలు వద్దు



ప్రచారం చేస్తున్న కెనరాబ్యాంకు అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: రూ.10 నాణెంపై అపోహలు వద్దని, ఎలాంటి ఇబ్బంది లేకుండా చెలామణి చేసుకోవచ్చని కెనరాబ్యాంకు అధికారులు తెలిపారు. ఈ అంశంపై మంగళవారం బ్యాంకు చీఫ్ మేనేజర్ సెంథిల్‌కుమార్, మేనేజర్ దివ్య ఆధ్వర్యంలో నగరంలో పలు ప్రాంతాల్లో ప్రచారం చేశారు. రూ.10 నాణెం చెలామణిలో లేదంటూ ఇటీవల కొందరు దుష్ప్రచారం సాగిస్తున్నందున సమస్య ఎదురవుతోందన్నారు. ఆర్‌బీఐ నిబంధనల మేరకు చెలామణిలో ఉన్నందున మార్పిడి చేసుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా స్వీట్‌షాప్స్, టీకొట్లు, కిరాణా స్టోర్స్, ఇతరత్రా దుకాణాదారులకు రూ.10 నాణెలు అందజేశారు.

హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు చేపట్టాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్

బొమ్మనహాళ్/రాయదుర్గం టౌన్/కణేకల్లు: జిల్లాకు సాగు, తాగునీరు అందించే హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులను వెంటనే చేపట్టాలని కూటమి ప్రభుత్వాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. జిల్లాకు సాగునీటి వనరుల సాధన, సమస్యల పరిష్కారంపై ప్రజలను చైతన్య పరిచేందుకు సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్రను మంగళవారం ఉంతకల్లు వద్ద ఆయన ప్రారంభించి, మాట్లాడారు. సరిహద్దులోని హెచ్చెల్సీ 105వ కిలోమీటర్ వద్ద నుంచి ప్రధాన కాలువతో పాటు డిస్ట్రిబ్యూటరీ కాలువలూ ఆధునికీకరించాల్సిన అవసరాన్ని గుర్తించామన్నారు. తుంగభద్ర జలాశయంలోని నీరు వృథాగా సముద్రం పాలు కాకుండా ఉంతకల్లు సమీపంలో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించడంతో పాటు జిల్లాలోని చెరువులు, కుంటలకు మళ్లించాలని డిమాండ్ చేశారు. సాగునీటి వనరుల సాధనలో భాగంగా ఈ నెల 21న కలెక్టరేట్ వద్ద తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కర్ణాటక సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సత్తిబాబు, జిల్లా నాయకులు నాగేంద్ర కుమార్, చంద్రశేఖర్, నాగమణి, కృష్ణమూర్తి, అచ్యుత ప్రసాద్, రంగారెడ్డి, ఓబులేసు, పెన్నయ్య, రాము, మాజీ సర్పంచ్ కోటేశ్వరరెడ్డి, కవుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాల రంగయ్య పాల్గొన్నారు.

సాగు, తాగునీటి సమస్యలు పరిష్కరించాలి

రాయదుర్గంలోని వినాయక సర్కిల్‌లో జరిగిన సభలో రాంభూపాల్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రైతులపై నిర్లక్ష్యం వహిస్తుందని మండిపడ్డారు. హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు, హంద్రీనీవా పంట కాలువల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. పీఏబీఆర్ విస్తరణకు అవసరమైన భూ సేకరణ జరిపి పూర్తి సామర్థ్యంతో నీటిని నిల్వ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. భైరవానితిప్ప ప్రాజెక్టుకు జీడిపల్లి నుంచి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.



బస్సు యాత్ర ప్రారంభిస్తున్న రాంభూపాల్

మద్యంపై చూపే శ్రద్ధ రైతాంగ సమస్యలపై చూపండి

కణేకల్లులో జరిగిన సభలో రాంభూపాల్ మాట్లాడుతూ.. ఈ ఏడాది భారీ వర్షాలతో తుంగభద్ర డ్యామ్ మూడు సార్లు నిండినా జిల్లాకు అవసరమైన మేర నీటిని తెచ్చుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. మద్యం షాపులపై చూపూ శ్రద్ధ రైతాంగ సమస్యల పరిష్కారంపై చూపితే రైతుల జీవితాలు బాగుపడతాయని పాలకులకు సూచించారు. టీబీ డ్యాం గేట్లను బాగు చేయడానికి రూ.150 కోట్లు ఖర్చు అవుతోందని ఇంజినీర్లు అంచనా వేశారని ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ ప్రభుత్వాలు చెరో రూ.50 కోట్లు కేటాయిస్తే కొత్త గేట్లు ఏర్పాటు చేయవచ్చునన్నారు. కూటమి సర్కారుతో డబ్బు లేకపోతే జిల్లాలో మద్యం టెండర్ ద్వారా సమకూరిన రూ.65 కోట్లలో రూ.50 కోట్లను గేట్ల బాగు కోసం కేటాయించాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాద కారకాలపై అన్వేషణ



బ్లాక్‌స్పాట్ పరిసరాలు పరిశీలిస్తున్న పోలీసులు

అనంతపురం: బ్లాక్‌స్పాట్స్ వద్ద జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు కారణాలపై అన్వేషణ, నియంత్రణకు కార్యాచరణ సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఎస్పీ పి. జగదీష్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో బ్లాక్ స్పాట్స్‌ను పోలీసు అధికారులు పరిశీలించారు. ప్రమాదాల నియంత్రణకు ఇంజినీరింగ్ మార్పులు ఏమైనా చేపట్టాలా? సరైన వెలుతురు కల్పించాలా? వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలా? అనే అంశాలపై అధ్యయనం చేస్తున్నారు.

18న జిల్లా జైలులో వేరుశనగ చెక్క వేలం

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని జిల్లా జైలులో ఈ నెల 18న 25 వేల కిలోల వేరుశనగ చెక్కకు వేలం నిర్వహించనున్నారు. ఈ మేరకు జైలు సూపరింటెండెంట్ రహమాన్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ వేలం పాటలో పాల్గొనేవారు రూ.22వేల డిపాజిట్ చెల్లించాలి. వేలం పాట ముగిసిన తరువాత డిపాజిట్ వెనక్కి చెల్లిస్తారు.

రేపు వాల్మీకి జయంతి

అనంతపురం రూరల్: ఈ నెల 17న మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూకొఠారి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర స్థాయి వేడుకలను అనంతపురంలో నిర్వహిస్తున్న తరుణంలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. గురువారం ఉదయం 10 గంటలకు పవర్ ఆఫీస్ పక్కన ఉన్న వాల్మీకి విగ్రహం వద్ద పూజల అనంతరం బళ్లా కన్వెన్షన్ హాల్‌లో సభ ఉంటుందన్నారు.

డీ-వార్మింగ్ మందుల పంపిణీ



నట్టల మందు పంపిణీ చేస్తున్న స్టోర్ ఇన్‌చార్జి డాక్టర్ వెంకటనాయుడు

అనంతపురం అగ్రికల్చర్: గొర్రెలు, మేకల్లో వ్యాపించే నట్టల నివారణకు డీవార్మింగ్ మందుల పంపిణీ ప్రక్రియ మొదలైంది. మంగళవారం స్థానిక పశుసంవర్ధకశాఖ జేడీ కార్యాలయ ప్రాంగణంలో స్టోర్ ఇన్‌చార్జి డాక్టర్ వెంకటనాయుడు ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పశువుల ఆస్పత్రులకు మందులు అందజేశారు. 27 లక్షల జీవాలకు ఉచితంగా నట్టల మందు తాపించేందుకు వీలుగా రూ.68 లక్షల విలువ చేసే మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. జేడీ డాక్టర్ జీపీ వెంకటస్వామి ఆదేశాల మేరకు త్వరలోనే జిల్లా వ్యాప్తంగా ఉచిత టీకాల కార్యక్రమం మొదలవుతుందన్నారు.

సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్ కుమార్

బ్రహ్మసముద్రం : సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని, ఈ విషయంగా అందరూ కలసి కట్టుగా పనిచేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులకు కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. బ్రహ్మసముద్రం మండలం వేపులపర్తిలో మంగళవారం నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుతో కలసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంతకు ముందు గ్రామ సచివాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఉపాధి హామి పథకం కింద గ్రామీణా ప్రాంతాల్లో జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఫారంపాండ్లు, ఇళ్ల వద్ద ఇంకుడు గుంతల నిర్మాణాలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం సభలో మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా తాగునీరు, రోడ్ల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటామన్నారు. నియోజకవర్గంలో ప్రజల సమస్యల పరిష్కారానికి ఈ డివిజన్ పరిధిలోని అధికారులతో త్వరలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఏర్పాటు చేస్తామని భరోసానిచ్చారు. ఎమ్మెల్యే అమిలినేని మాట్లాడుతూ... వేపులపర్తి సమీపంలో వేదావతి హగరిపై త్వరంలో బ్రిడ్జి నిర్మాణం చేపడతామన్నారు. బీటీపీకు నీరందించే పనులు కూడా పూర్తి చేస్తామన్నారు. అనంతరం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వేపులపర్తి ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఆర్డీఓ వినూత్న, పంచాయతీ రాజ్ ఎస్ఈ జహీర్ అస్లాం, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, డ్వామా పీడీ సలీంబాషా, డీఏఓ ఉమామహేశ్వరమ్మ, ఏసీ నారాయణ స్వామి, ట్రాన్స్ కో ఏడీ శ్రీనివాసరావు, పీఆర్ డీఈ రాజన్న, ఏపీడీ రమేష్‌నాయక్, సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న, తహసీల్దార్ సుమతి, ఎంపీడీఓ నందకిశోర్, జెడ్పీటీసీ ప్రభావతి, సర్పంచ్ రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో తస్మాత్ జాగ్రత్త

గుంతకల్లుటౌన్: తక్కువ పెట్టుబడితో ఎక్కువ సంపాదించి కొద్ది రోజుల్లోనే ధనవంతులు కావాలనే వారి అత్యాశనే సైబర్ నేరగాళ్లు క్యాష్ చేసుకుంటున్నారని, అప్రమత్తంగా ఉంటే సైబర్ నేరాలను అరికట్టవచ్చని ఎస్పీ జగదీష్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన పట్టణంలోని పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేశారు. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో పెండింగ్ కేసులు, క్రైమ్ రేట్, రౌడీషీటర్ల వివరాలు, పోలీసు సిబ్బంది సంక్షేమంపై ఎస్‌హెచ్ఓలతో ఆరాతీశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సైబర్ మోసాలపై కళాశాలల్లో విద్యార్థులు, ప్రజలతో పాటు సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. డీఎస్పీ శ్రీనివాసులు, వన్‌టౌన్,టూటౌన్,రూరల్ సీఐలు మనోహర్, మస్తాన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మట్కాపై ఉక్కు పాదం

గుత్తి: జిల్లాలోని పలు ప్రాంతాల్లో మట్కా జరుగుతున్నట్లు సమాచారం ఉందని, మట్కా నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ జగదీష్ హెచ్చరించారు. గుత్తి పోలీసు స్టేషన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. స్టేషన్‌లోని అన్ని విభాగాలతో క్రైమ్ రికార్డులు పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే చాలా మంది బడా మట్కా రాయుళ్లను అరెస్టు చేసినట్లు గుర్తు చేశారు. మట్కాను పూర్తి గా నిర్మూలించాలంటే ప్రజల సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

పీఏసీఎస్‌ల కంప్యూటరైజేషన్ పూర్తి చేయాలి

అనంతపురం అర్బన్: జిల్లాలోని పీఏసీఎస్‌ల (ప్రైమరీ అగ్రికల్చర్ కో–ఆపరేటివ్ సొసైటీ) కంప్యూటరైజేషన్ ప్రక్రియ నవంబర్ 1వ తేదీలోపు వంద శాతం పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశించారు. ప్రక్రియను నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీఏసీఎస్‌ల కంప్యూటరైజేషన్ ప్రక్రియలో భాగమైన డైరీల ప్రొగ్రెస్ రిపోర్ట్, డీటీసీ పోర్టల్‌లో డేటా అప్‌లోడ్ అంశంపై కలెక్టర్ మంగళవారం తన క్యాంపు కార్యాలయం నుంచి అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, ఆర్డీఓలు, డీఎల్‌డీఓల, డీసీఓ, నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పీఏసీఎస్‌ల కంప్యూటరైజషన్ ప్రక్రియలో ప్రతి రోజూ ప్రగతి చూపించాలన్నారు. ప్రతి పీఏసీఎస్‌కు ఒక డిజిటల్ అసిస్టెంట్‌ను, వీఆర్ఓను, పంచాయతీ కార్యదర్శిని నియమించాలని చెప్పారు. కంప్యూటరైజేషన్ ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోజువారీగా డేటా అప్‌లోడ్ చేపట్టాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌ల డీసీఓ అరుణకుమారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుడి బలవన్మరణం



రంగనాయకులు (ఫైల్)

తాడిపత్రి రూరల్: అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రి మండలం చిన్నపొలమడకు చెందిన రంగనాయకులు (50)కు భార్య లక్ష్మీదేవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చేనేత మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవారు. ఈ క్రమంలో పదేళ్ల క్రితం తన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభ్యం కాక అప్పట్లో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు కూరుకుపోయిన ఆయన విషపు గుళ్లికలు మింగి ఆత్మహత్యాయత్నం చేశాడు. సకాలంలో కుటుంబసభ్యులు గుర్తించి చికిత్స అందివ్వడం ద్వారా ప్రాణాలతో బయటపడ్డాడు. మూడేళ్ల క్రితం పక్షవాతం సోకింది. అప్పటి నుంచి భార్య లక్ష్మీదేవి మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. పక్షవాతం కారణంగా ఏ పనీ చేయలేకపోతున్నాననే ఆవేదన రంగనాయకులను వేధిస్తూ వచ్చింది. ఈ క్రమంలోనే కుటుంబంలో మరోసారి ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన మంగళవారం చిన్నపొలమడ సమీపంలో పట్టాలపైకి చేరుకుని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై తాడిపత్రి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వీడు మాములోడు కాదు!

- గ్యాంగ్‌రేప్ కేసు ప్రధాన నిందితుడు నాగేంద్రకు భారీ నేరచరిత్ర
- 37కు పైగా కేసులు





ఎరికల నాగేంద్ర, సాకే ప్రవీణ్‌కుమార్

హిందూపురం: చిలమత్తూరు మండలం నల్లబొమ్మనపల్లి సమీపంలో నిర్మాణ దశలో ఉన్న పేపర్‌మిల్లు వద్ద దసరా పండుగ నాడు వాచ్‌మెన్ కుటుంబంపై దాడిచేసి.. ఇద్దరు మహిళలపై సామూహిక అత్యాచారానికి ఒడిగట్టిన నిందితులు పలు దారి దోపిడీలు, అత్యాచార కేసుల్లో నిందితులుగా ఉన్నారు. తాగుడు, జల్సాలకు అలవాటు పడి చోరీలను వ్యసనంగా మార్చుకున్న హిందూపురం త్యాగరాజనగర్‌కు చెందిన ప్రధాన నిందితుడు ఎరికల కావడి నాగేంద్రకు భారీ నేర చరిత్ర ఉంది. మద్యం, గంజాయి, అమ్మాయిల సుఖానికి అలవాటు పడి నేరాలే పనిగా పెట్టుకుని జీవనం సాగించేవాడు. ఇప్పటిదాకా 37కు పైగా కేసులు ఉన్నాయంటేనే ఎంతటి కరుడుగట్టిన నేరస్తుడో అర్థం చేసుకోవచ్చు. ఇతనిపై హిందూపురం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో మూడు చోరీ కేసులు, రూరల్ పీఎస్‌లో రెండుచోరీ కేసులు, మద్యం కేసులు, ఆదోని టూటౌన్ పీఎస్‌లో రెండు చోరీ కేసులు నమోదయ్యాయి. కుప్పం ప్రాంతంలోనూ చోరీలు చేసిన నేపథ్యం ఉంది. గత ఏడాది గోరంట్లలో ఇతనితో పాటు కలిసి పనిచేసిన ఇల్లూ అనే వ్యక్తిని హత్యచేశాడు. హిందూపురం సమీపంలోని ఓ కళాశాల పరిసరాల్లో ఉంటూ విద్యార్థులు జంటగా లేదా ఒంటరిగా కనిపిస్తే బెదిరించడం, కొట్టడం వంటివి చేశాడు. అమ్మాయిలను రేప్ చేసి.. ఆ దృశ్యాలను చిత్రీకరించి ఎక్కడైనా చెబితే సోషల్ మీడియాలో పెడతామని బెదిరించిన ఘటనలూ ఉన్నాయి. అధికంగా హైవేలు, మారుమూల దారుల్లో చోరీలు చేసినట్లుగా పోలీసుల విచారణలో అంగీకరించినట్లు సమాచారం. త్యాగరాజనగర్ ప్రాంతానికే చెందిన మరో నిందితుడు సాకే ప్రవీణ్‌కుమార్‌పై లేపాక్షి పోలీస్‌స్టేషన్‌లో హత్య కేసు నమోదైంది. ఇక పరారీలో ఉన్న చాకలి శ్రీనివాసులు అలియాస్ శ్రీనాథ్ హిందూపురం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో దోపిడీ కేసులో ముద్దాయిగా ఉన్నాడు. ఇతని స్వగ్రామం లేపాక్షి మండలం కల్లూరు కాగా..ప్రస్తుతం హిందూపురం త్యాగరాజనగర్ గుడ్డం ఏరియాలో నివాసం ఉంటున్నాడు.

క్లుప్తంగా

ధర్మ ప్రచారం కోసం సైకిల్ యాత్ర



సైకిల్‌యాత్రలో కర్ణాటక వాసులు

అనంతపురం కల్చరల్: ధర్మప్రచారమే లక్ష్యంగా బెంగళూరులోని వైట్ ఫీల్డ్స్‌కు చెందిన 13 మంది యాత్రికులు కర్ణాటక నుంచి అయోధ్య రామమందిరం వరకు సైకిల్ యాత్ర చేపట్టారు. మంగళవారం యాత్ర నగరానికి చేరుకుంది. ఈ సందర్భంగా యాత్రికుల బృందం నాయకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ సనాతన భారతీయ వ్యవస్థకు దర్పణమైన ధర్మప్రచారం కేవలం యతీంద్రులు, రుషి పుంగవులు మాత్రమే చేయాలని అందరూ అనుకుంటారని కానీ ధర్మప్రచార బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే తాము హైందవ ధర్మంలోని విశిష్టతను తెలియజేస్తున్నామన్నారు. రోజుకు 120 కి.మీ. ప్రయాణం చేస్తుంటామని మరో 18 రోజులకు అయోధ్య చేరుకుంటామన్న విశ్వాసాన్ని వెలిబుచ్చారు. అంతకు ముందు అనంతకు విచ్చేసిన సైకిల్ యాత్రికులు పలువురు హిందూ సంస్థల ప్రతినిధులు ఆత్మీయ స్వాగతం పలికారు.

‘వాల్మీకి జయంతిని జయప్రదం చేయండి’

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న వాల్మీకి జయంతిని జయప్రదం చేయాలని వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్సీ అక్కులప్ప, ప్రధాన కార్యదర్శి చైతన్యకుమార్, కోశాధికారి పవన్ కుమార్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వాల్మీకి జయంతి 17న ఉదయం 9.30 గంటలకు అనంతపురం పాతూరు పవర్ ఆఫీస్ వద్ద మహర్షి వాల్మీకి విగ్రహానికి నివాళులర్పిస్తారని పేర్కొన్నారు. అనంతరం గుత్తి రోడ్డులోని బల్లా కన్వెన్షన్ హాలులో వేడుకలు ఉంటాయని తెలిపారు. రాజకీయ పార్టీలకు అతీతంగా జిల్లాలోని వాల్మీకి ఉద్యోగులు, కులస్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఈ- క్రాప్ రైతుల జాబితా ప్రదర్శన



సనపలో రైతుల వివరాలు తెలియజేస్తున్న ఏఓ సుచరిత

ఆత్మకూరు: ఖరీఫ్‌లో ఈ- క్రాప్, ఈకేవైసీ చేయించిన రైతుల వివరాల జాబితాను మంగళవారం మదిగుబ్బ, బి, యాలేరు, సనప గ్రామాల్లో ఏఓ సుచరిత ప్రదర్శించారు. జాబితాలో వివరాలపై అభ్యంతరాలు ఏమైనా ఉంటే రాత పూర్వకంగా వ్యవసాయ సిబ్బందికి తెలియజేయాలని ఏఓ సూచించారు.

21న మండల సర్వసభ్య సమావేశం

కనగానపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 21న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అనిల్‌కుమార్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఆయన మండల స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహణపై చర్చించారు. ప్రగతి నివేదికలు సిద్ధం చేసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.

వైద్య శిబిరం



అనంతపురం సెంట్రల్: ఏపీ ఎన్‌జీఓ నగరశాఖ, కిమ్స్ సవీరా ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక హెచ్చెల్సీ కాలనీలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సవీరా ఆసుపత్రి వైద్యులు, ఏపీఎన్‌జీఓ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌బాబు, రొళ్ల శ్రీనివాసులు, మహబూబ్‌దౌలా, రామాంజనేయులు, నాగరాజు, దామోదర్, విష్ణువర్ధన్, సుధాకర్‌రెడ్డి, విష్ణు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీత, అధికారులు

ఆత్మకూరు: బి.యాలేరు గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పరిటాల సునీత మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో వేస్తున్న సీసీ రోడ్లు, గోకుంల షెడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. డీపీఓ నాగరాజు, ఎంపీడీఓ లక్ష్మీనరసింహస్వామి, తహసీల్దార్ లక్ష్మీనాయక్, ఏఓ సుచరిత, ఏపీడీ అనురాధ పాల్గొన్నారు.

సమస్యల సచివాలయాలు



ఆత్మకూరులో రైతుసేవా కేంద్రం పక్కన నిర్మించి నీరు లేకపోవడంతో వదిలేసిన మరుగుదొడ్లు



నీటి సౌకర్యం లేని ఆత్మకూరు సచివాలయం, రైతు సేవా కేంద్రం

- వేధిస్తున్న నీటి సమస్య
- నిరుపయోగంగా మరుగుదొడ్లు
- సచివాలయ ఉద్యోగులకు తప్పని ఇక్కట్లు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

ఆత్మకూరు: ఏదైనా సమస్య వస్తే వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుంటారు. కాని మండలంలో మాత్రం అధికారులకే సమస్యలు వచ్చినా పట్టించుకునేవారే కరువయ్యారు. మండల వ్యాప్తంగా 11 గ్రామ సచివాలయాలు,11 రైతు సేవా కేంద్రాల్లో దాదాపు సగం పైగా కార్యాలయాల్లో నీరు లేక సచివాలయ ఉద్యోగస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఆత్మకూరు సచివాలయం-2, రైతు సేవా కేంద్రం, పంపనూరు, వేపచెర్ల, యాలేరు గ్రామాల సచివాలయాలు రైతు సేవా కేంద్రాల్లో నీటి సౌకర్యం లేక ఉద్యోగస్తులు అవస్థలు పడుతున్నారు. తలుపూరు సచివాలయ వ్యవహారం కోర్టులో ఉండటంతో పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. అక్కడ మరుగుదొడ్లు, నీటి సౌకర్యం లేకపోవడంతో ఉద్యోగస్తులు పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాల మరుగుదొడ్లలోకి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

ఉన్నతాధికారులకు తెలిసినా పట్టించుకోరా ?

సచివాలయంలో నెలకొన్న సమస్యలను కొంతమంది సచివాలయ ఉద్యోగస్తులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా రైతు సేవా కేంద్రాలకు సంబంధించి చాలా చోట్ల పక్కన మరుగుదొడ్లు నిర్మించారు. కాని వాటికి నీటి సౌకర్యం లేకపోవడంతో అవి కాస్త నిరుపయోగంగానే ఉన్నాయి. ఉన్నత అధికారులు స్పందించి సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలకు నీటి సౌకర్యం కల్పించాలని సచివాలయ ఉద్యోగస్తులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా చాలా సచివాలయాల్లో ప్రింటర్లు పని చెయ్యకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సచివాలయాల్లో నీటి సమస్యలతోపాటు ప్రింటర్లను మరమ్మతు చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మద్యం టెండర్లలో కూటమి నేతల దౌర్జన్యం

అనంతపురం టవర్‌క్లాక్: జిల్లాలో మద్యం టెండర్లలో కూటమి ఎమ్మెల్యేలు, నాయకుల దౌర్జన్యం పెచ్చుమీరాయని డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. ఈమేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మద్యం టెండర్లలో పాల్గొంటున్న వారిపై టీడీపీ ఎమ్మెల్యేలు, నాయకులు బహిరంగంగా 15 శాతం నుంచి 20 శాతం వరకు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడుతున్నారని, సీఎం చంద్రబాబు వారిని అదుపులో పెట్టుకోకపోవడం సరికాదని పేర్కొన్నారు. ఏ తప్పు జరిగినా ప్రశ్నిస్తానన్న డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ మద్యం టెండర్ల విషయంలో ఎందుకు నోరుమెదపడం లేదని ప్రశ్నించారు. శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు వేతనాలు రాక అవస్థలు పడుతున్నారని, మరోవైపు గ్రామాల్లో ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం వీటిని పట్టించుకోకుండా మద్యం టెండర్లలో బిజీగా ఉందని విమర్శించారు. విత్తన వప్పుశనగ సబ్సిడీని 33 శాతం నుంచి 25 శాతానికి తగ్గించడం దారుణమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాలన ఇలాగే సాగితే ఇతర పార్టీలను కలుపుకొని పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

యువతకు ఆదర్శం అబ్దుల్ కలాం



మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ వసీం



అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీవీఈఓ రఘునాథరెడ్డి



అబ్దుల్‌కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఇంచార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు

- మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం యువతకు ఆదర్శమని మేయర్ వసీం పేర్కొన్నారు. అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని మంగళవారం నగరపాలక సంస్థలో ఆయన చిత్రపటానికి మేయర్ నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ నిర్మాణంలో ఏపీజే అబ్దుల్ కలాం చేసిన కృషి సాటిలేనిదన్నారు. కలలు కనండి వాటిని సాకారం చేసుకోండి అంటూ ఆ మహనీయుడిచ్చిన పిలుపు ఎందరో యువతకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా ఏపీజే అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు లాలూ, రహంతుల్లా, సైపుల్లాబేగ్, అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అనంతపురం ఎడ్యుకేషన్: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ జయంతి వేడుకలను మంగళవారం స్థానిక కొత్తూరు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. శ్రీ సత్యసాయి జిల్లా ఇంటర్ విద్యాధికారి, కళాశాల ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలను తెలియజేశారు. భారత్ అనేక క్షిపణులను విజయవంతంగా ప్రయోగించడంలో కలాం విశేష కృషి చేశారన్నారు. అందుకే ఆయనను మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా అని పిలుస్తారన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సిద్దేశ్వర ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు నారాయణరెడ్డి, అక్బర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అనంతపురం: మాజీ భారత రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తిని కొనసాగించాలని జేఎన్‌టీయూ అనంతపురం ఇంచార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం పాలకభవనంలో అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అబ్దుల్ కలాం గొప్ప శాస్త్రవేత్తగాక అంతకు మించి ఉపాధ్యాయుడన్నారు. కార్యక్రమంలో వర్సిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి నిర్వహించారు. రెక్టార్ ప్రొఫెసర్ జి. వెంకటనాయుడు అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలను కొనియాడారు. రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ.కృష్ణకుమారి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రామచంద్ర పాల్గొన్నారు.



ఇస్కాన్ టెంపుల్ వద్ద దట్టంగా కమ్ముకున్న మేఘాలు



అనంతపురం జాతీయ రహదారిపై మేఘావృతమైన ఆకాశం

కమ్ముకున్న మేఘం.. విరిసిన సంతోషం

తుపాన్ ప్రభావంతో ఆకాశం మేఘావృతమైంది. దట్టమైన మేఘాలు చూపరులను కట్టిపడేశాయి. చల్లని గాలులు, ఆహ్లాదకర వాతావరణం ప్రజలను సంతోషపరిచాయి. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకూ ఇదే వాతావరణ కనిపించింది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



అనంతపురం క్లాక్‌టవర్ వద్ద ఇలా..

ముగిసిన దస్తగిరి స్వామి ఉరుసు

అనంతపురం కల్చరల్: నగరంలోని శ్రీనివాసనగర్‌లో షాహే గౌసే ఆజం ఆషార్ దర్గాలో పది రోజుల పాటు సాగిన మాబు సుబహాని (దస్తగిరి స్వామి) ఉరుసు మంగళవారం ముగిసింది. ఆసార్ కమిటీ అధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్ నేతృత్వంలో వేడుకలు సాయంత్రం నుంచి రాత్రి వరకు కొనసాగాయి. జష్నే మిద్ హతే గౌసే ఆజం పేరుతో సాగిన ఉత్సవంలో కర్నూలుకు చెందిన హజరత్ సయ్యద్ మహ్మద్ షా వజ్యూద్దీన్ ఖాదిరి ఆధ్వర్యంలో గుసుల్‌తో పాటూ ప్రత్యేక దువా చేశారు. అనంతరం వక్తలు ఉరుసు ప్రాధాన్యతను వివరించారు. దస్తగిరిస్వామి పవిత్ర కేశాన్ని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తరలివచ్చారు. షాహే గౌసే ఆజం ప్రతినిధులు నవీద్‌ఖాన్, అబ్దుల్ సమీ తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యం అభినందనీయం

కుల మతాలకతీతంగా సాగే దస్తగిరి స్వామి ఉరుసు నిర్వహణ అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. ఈసందర్భంగా ఆయన మేయర్ వసీంతో కలిసి మాబు సుబహాని కేశ దర్శనం చేసుకుని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం వారు స్వయంగా భక్తులకు భోజనం వడ్డించారు. అనంతరం దర్గా నిర్వాహకులు ముఖ్య అతిథులను సత్కరించారు.



మాబుసుబానీ దర్గాలో దస్తగిరిస్వామి పవిత్ర కేశదర్శనంలో భక్తులు

23న అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు

రాప్తాడు: ఐసీడీఎస్ అనంతపురం రూరల్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న ఒక మినీ అంగన్ వాడీ వర్కర్, 9 ఆయా పోస్టుల భర్తీకి ఈ నెల 23న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈ మేరకు సీడీపీఓ ధనలక్ష్మి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 16న జరగాల్సిన ఇంటార్వ్యూలు భారీ వర్షాల కారణంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వాయిదా వేశామని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 23న ఉదయం 10 గంటలకు అనంతపురంలోని ఆర్డీ కార్యాలయంలో హాజరుకావాలని సూచించారు. విద్యార్హతకు సంబంధించి ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని పేర్కొన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

అనంతపురం రూరల్: మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలతో అనంతపురం ఆర్డీఓ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆర్డీఓ వసంతబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తుఫాన్ ప్రభావంతో బారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులపై పర్యవేక్షణ కరువు

- రూ.2.2 కోట్ల పనుల వైపు కన్నెత్తి చూడని అధికారులు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ ఇంజినీర్లు మొద్దు నిద్ర వీడడం లేదు. రూ.కోట్లతో చేపట్టే పనులను సైతం తేలిగ్గా తీసుకుంటున్నారు. నగరంలోని శ్రీనగర్ కాలనీలో రూ.2.2 కోట్ల ఎన్ క్యాప్ నిధులతో రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ పనులను పర్యవేక్షించే నాథుడే లేరు. ఇప్పటికే వర్క్ ఆర్డర్ లేకుండా కాంట్రాక్టర్ పనులు చేపట్టేలా ఈఈ రాధాకృష్ణ, డీఈ సుభాష్ చంద్రబోస్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సాక్షి పత్రికలో కథనం వెలువడడంతో ఆగమేఘాలపై ఆ పనులకు వర్క్ ఆర్డర్ ఇచ్చారు అధికారులు. కనీసం ఆ పనులు జరిగే సమయంలోనైనా ఏఈ, డీఈ, అమినిటీ సెక్రటరీలు అటువైపు తొంగి చూడలేదు. నగరపాలక సంస్థ కమిషనర్ నాగరాజు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి తగు చర్యలు తీసుకుంటే బాగుంటుందని నగరపాలక సంస్థ వర్గాలంటున్నాయి. నగరంలో ఇప్పటికే రూ.13 కోట్ల పనులు నిలిచిపోయాయి. పనులు చేపట్టే ప్రాంతంలోనైనా అధికారులుంటే నాణ్యతగా జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఈఈ, డీఈలు మేలుకుంటారో లేదో వేచి చూడాలి.



శ్రీనగర్ కాలనీలో ఎన్ క్యాప్ నిధులతో జరుగుతున్న రోడ్డు పనులు

కమనీయం.. శ్రీనివాస కల్యాణం



పూజలందుకున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు



స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్: శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణం మంగళవారం కమనీయంగా సాగింది. నగరంలోని శివ బాలయోగి ఆశ్రమంలో దసరా ఉత్సవాల్లో భాగంగా ఉదయం శ్రీవారి పరిణయ వేడుకలను వేదపండితులు శాస్త్రోక్తంగా జరిపించారు. అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తజన సందోహం నడుమ ఎదురుకోలు, మాంగల్యధారణ, తలంబ్రాలు, శయనోత్సవ ఘట్టాలు సంప్రదాయంగా సాగాయి. అంతకు ముందు ఆశ్రమంలోని నిలువెత్తు వేంకటేశ్వరుడికి జలాభిషేకం, మంగళ స్నానాలు, పంచామృతాభిషేక సేవలు నిర్వహించారు. స్వామివారి భక్తిగీతాలాపన, సంపూర్ణ నివేదన, తీర్థప్రసాద వితరణలో ఆశ్రమ ప్రతినిధులు అరవింద్, రత్నగిరి దేవరాజ్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

‘16, 18 తేదీల్లో సర్వసభ్య సమావేశం లేదు’

అనంతపురం: అనంతపురం క్లబ్ సర్వసభ్య సమావేశం ఈ నెల 16, 18 తేదీల్లో నిర్వహించడం లేదని క్లబ్ ఇంచార్జి కార్యదర్శి మూలా శ్రీనివాస్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశం నిర్వహిస్తే ముందస్తుగా సభ్యులందరికీ సమాచారం ఇస్తామని పేర్కొన్నారు.

బాలాజీకి జేఎన్‌టీయూ డాక్టరేట్



అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో పరిశోధన చేసిన ఎం. బాలాజీకి డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ కే. హేమచంద్రారెడ్డి పర్యవేక్షణలో ‘ సీఎఫ్‌డీ న్యూమరికల్ సిమ్యులేషన్ ఫర్ ఇన్‌టేక్ ఫ్లో ఫీల్డ్ డిజైన్ అండ్ ఎఫెక్ట్స్ ఆన్ కంబూషన్ అండ్ ఎమిషన్స్ ఆఫ్ డీఐ డీజిల్ ఇంజిన్’ అనే అంశంపై పరిశోధన చేశారు.

నడిమివంక, మరువవంకల్లో పూడికతీత పనులు

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని నడిమివంక, మరువవంకలో మంగళవారం నగరపాలక సంస్థ అధికారులు పూడికతీత పనులు చేపట్టారు. నగరపాలక సంస్థ కమిషనర్ నాగరాజు, ఈఈలు రాధాకృష్ణ నడిమివంకకు ఆనుకుని ఉన్న ఆజాద్‌నగర్, రంగస్వామి నగర్, కైలాసం రోడ్డు, 5, 6 వ రోడ్డు, హనుమాన్ నగర్, రజకనగర్, సోమనాథ్ నగర్, మరువవంకకు ఆనుకుని ఉన్న ఖాజానగర్, ఐరన్ బ్రిడ్జి, పాత కృష్ణా థియేటర్ వద్ద బ్రిడ్జి, గౌరీ కాంప్లెక్స్, వేణుగోపాల్ నగర్, షిర్డీనగర్ ప్రాంతాల్లో పూడిక తీయించారు. మేయర్ వసీం పనులు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఫాగింగ్, స్ప్రేయింగ్, బ్లీచింగ్ చల్లాలని ప్రజారోగ్యాధికారులను మేయర్ ఆదేశించారు. అత్యవసర పరిస్థితులో కంట్రోల్ రూం నంబర్లు 08554-230234, 08554-274765,849907388కు ఫోన్ చేయాలని మేయర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మేయర్ వెంట డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, కార్పొరేటర్లు రహంతుల్లా, సైపుల్లాబేగ్, వైఎస్సార్ సీపీ నేత చింతకుంట మధు ఉన్నారు.



పూడికతీత పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

పొగచూరిన ప్రయాణం



పొగ మధ్యలో వెళ్తున్న వాహనదారులు

వడియంపేట గ్రామ సమీపంలో ఆకతాయిలు చెత్తకు నిప్పు పెట్టడంతో దట్టమైన పొగ కమ్ముకుంది. దీంతో అటుగా వెళ్లే వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఇబ్బందులు పడ్డారు. గంటల తరబడి అలాగే అవస్థలు పడుతూ పడుతూ ప్రయాణం కొనసాగించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం